48.

# భారతదేశ ఔన్నత్యమునకు మూలకారణం స్త్రీలే

గతజీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి
సావిత్రి భారత సతియె కాదె
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి భారతీయ గాదె
కుల సతీత్వము అగ్నిగుండాన ప్రకటించె
సీత భారత ధరాజాత కాదె
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి కాదె
సప్తసాగర పరివేష్టితోర్వితలము
భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపదకిది మహా పంటభూమి
అఖిల దేశాలకిది ఉపాధ్యాయి కాదె

బ్రహ్మదర్శన భాగ్యంబు బడయగోరి
వెతకబోదు వెచటికే వెట్టి మనస
అతడు నీలోనె ఉన్నాడు వెతుకుమచట
మరువబోకుడు శ్రీ సాయి మంచిమాట

ప్రేమస్వరూపులారా!

ప్రాచీనకాలము నుండి, భారతదేశము ఆధ్యాత్మిక తత్వప్రభావము చేత సర్వ రాజ్యములకు సుస్థిర శాంతి భద్రతలు చేకూరుస్తూ వస్తున్నది. అనాదికాలము నుండి దేశమును రక్షించునది రాజులు మాత్రమే కాదు, పతివ్రతామ తల్లులు కూడా ఇందులో భాగము వహించారు. ఉత్తమ స్త్రీ, పురుషులు ఉండటం చేతనే రాజ్యము ఈ విధమైన సుక్షేమాన్ని అందుకోగల్గింది. భారతదేశము యొక్క ఔన్నత్యము, నిత్యతత్వములో కూడిన

sri sathyasai vachanamrutam

ధైర్యత్వము ఈ స్త్రీనుండే ఆవిర్భవించింది. కౌసల్య తన బిడ్డల ఉన్నతికి అనేక వ్రతములు చేసి యజ్ఞయాగాది క్రతువు లాచరించింది.

**కౌసల్య సతి శుక్తి గర్భమౌటను కదా**
**రాముడు దేవుడై రమణ గాంచె**
**సీతామహాసాధ్వి చెలగి పెంచుట కదా**
**కవలలు లవకుశులు ఘనులు అగుట**
**పుతలీబాయి రంజిల్ల పెంచుట కదా**
**గాంధి మహాత్ముడై ఘనత గాంచె**

**జిజియా లలామ చెలగి పెంచుట కదా**
**వీర శివాజీయు పేరుగాంచె**

తల్లులయొక్క ప్రేమచేతను, శక్తిచేతను, వ్రతములచేతను పుత్రులు సత్పుత్రులుగా, వీరపుత్రులుగా, ఆదర్శపుత్రులుగా మారుతున్నారు. ప్రపంచమునకు తల్లులే మూలాధారము. దేశమును మాతృదేశమంటారు గానీ పితృదేశమని చెప్పరు. భాషను కూడా మాతృభాష అంటారు గాని పితృభాష అనరు. తల్లులయందు ఈ పవిత్రమైన శక్తి సామర్థ్యములు ఉండటం చేత సత్పుత్రులు, సదాచార సంపన్నులు ఈ దేశములో అభివృద్ధి గాంచుతూ వచ్చారు. ఆనాటి తల్లులు సద్బోధలు సల్పుతు, పిల్లలను సత్ప్రవర్తనలో నిలుపుకుంటు వచ్చారు.

పిల్లలయొక్క యోగక్షేమము తల్లులపై ఆధారపడి ఉంటున్నది. కనుక, తల్లులయొక్క దివ్యత్వాన్ని విద్యార్థులుగానీ, లేక బాలురుగానీ తల్లిని మరువకూడదు. మొట్టమొదట తల్లులకు కృతజ్ఞత చూపాలి. తల్లులకు గౌరవాన్ని అందించాలి. తల్లులకు సేవ చేయాలి. తల్లిప్రేమచేతనే పుత్రుడు సద్విద్యను సల్పుతున్నాడు. ఈనాటి పిల్లలయందుగానీ, పెద్దలయందుగానీ దైవత్వము సాక్షాత్కరించటానికి మూలకారణం తల్లులే. నాటి నుండి నవమాసములు మోసిన తల్లి అనేక కష్టములకు నష్టములకు గురై తన జీవితమును

srisathyasaivachanamrutam

త్యాగము చేసి పుత్ర అభివృద్ధిని కోరుతూ వచ్చింది. కనుక, తల్లులను ఆనాటినుండి **'నాదబిందు కళాస్వరూపా'** అని పిలుస్తూ వచ్చారు. ఈ నాద, బిందు, కళ యీ మూడింటి స్వరూపమే మానవ స్వరూపము. నాదమనగా ఏమిటి? ప్రాణ, వాయువు రెండింటి ఏకత్వము చేత ఘోరమైన శబ్దము ఏర్పడుతూ వచ్చింది. ప్రాణ, వాయువుల యొక్క సమ్మిళితమైన స్వరూపమే ఓంకారమని చెబుతూ వచ్చారు. ఇంక శరీరము, ప్రాణము, మనస్సు యొక్క సంకల్పము చేత బుద్ధి యొక్క స్వరూపము ధరిస్తూ వచ్చింది. ఇట్టి బుద్ధినే ఒక విధమైన బిందు అని పిలుస్తూ వచ్చారు. ఓంకార నాదము శరీర మనో బుద్ధుల చేరికచేత బిందువుగా ఏర్పడి పోయింది. ఇంక ఉండినదంతా ఒక్కటే కళ. బుద్ధియందు ప్రతిబింబించే దైవ స్వరూపమునకే 'కళ' అని పేరు. కనుక, నాదబిందు కళ యీ మూడింటి స్వరూపుడే మానవుడు.

**నాదబిందుకళలకు అతీతమైనదే ఆత్మతత్త్వము**

శరీర ప్రాణబుద్ధుల యొక్క స్వరూపమని మానవత్వాన్ని పూజిస్తూ వచ్చారు. అయితే ఆత్మ ఎవరు? మూడింటికి అతీతమైన సచ్చిదానంత స్వరూపమే ఆత్మ. నాద, బిందు, కళలకు అతీతమైనదే ఆత్మతత్వము. కనుక **"నాదబిందుకళా తీతానమో నమః"** అన్నారు ఆనాటి ఋషులు. అతీతుడైనవాడు భగవంతుడు. ఈనాదు బిందు కళలు ప్రకృతి సృష్టికి మాత్రమే పనికి వస్తుంటాయి. కానీ, ఇందులో అతీతమైన శక్తిని చేర్చటానికి నాదబిందుకళలకు ఏమాత్రము అధికారము లేదు. మట్టి, నీరు, రెండు కలిపి కుండలు, తట్టలు చేస్తున్నాడు కుమ్మరి. అయితే కుండ చేసినంత మాత్రమున తాను సృష్టికర్త అవుతున్నాడా? కాదు కాదు. దైవత్వమనే దివ్యత్వము ఈ దేహమందు ప్రవేశించి తద్వారా ఈ దివ్యత్వానికి చైతన్యము చేకూరుస్తూ వస్తున్నాది. ఆధ్యాత్మికతత్వము సత్కర్మలకు, సదాచారములకు, సత్క్రియలకు పనికి వచ్చేది. చిత్తశుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని గావించేదే ఆధ్యాత్మికము. కానీ యింతటితో మాత్రమే యిది పూర్తి కాదు. హృదయము పరిశుద్ధమై ఉండాలి. హృదయ పరిశుద్ధమే లేకుండిన చిత్తశుద్ధి గానీ, చిత్తనిర్మలతగానీ చిత్తవ్యాప్తిగానీ ఏమాత్రము చేకూరదు. ఈ హృదయము నకు దుర్గుణములు, దురాచారములు అనే లతలు అల్లుకొనిపోతుంటాయి. ఇందుకు ఏమాత్రం అవకాశం అందించకూడదు. ఒకసారి చెట్టుకు

sri sathyasaivachanamrutam

అల్లుకు పోయిన లత (creeper) పెరిగి పెరిగి కట్టకడపటికి చెట్టునే మూసివేస్తుంది. కట్టకడపటికి వృక్షమునే నాశనము గావిస్తుంది. కనుక, మానవత్వమునకు కామ, క్రోధ లోభ మోహములనే లతలు అల్లుకోకుండా చూచుకోవాలి.

**ప్రతివ్యక్తి తన ఇంద్రియములను అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించాలి**

వేద శాస్త్రములు అధికముగా వల్లించినవాడు, చదివినవాడు, మహాశక్తి సంపన్నుడు, మహా తపస్వి అయిన రావణుడు ఎన్ని విధములుగా అభివృద్ధి పొందినప్పటికి, 64 విద్యలు నేర్చినప్పటికి రావణునియందు కూడా "కామము" అనే లత అల్లుకోటం చేత తాను సంపూర్ణముగా శిథిలమైపోయాడు. తాను మాత్రమే కాక తన రాజ్యమును భస్మము గావించుకున్నాడు. కనుక, చిత్తశుద్ధియే లేకున్న ఎన్ని విధముల సాధనలు చేసినప్పటికిని ప్రయోజనముండదు. కనుకనే తిరుత్తొండాళ్వారు కూడను "నేను పూవులతో కాదు నిన్ను పూజ చేయటం, చిత్తశుద్ధిచేత నిన్ను పూజిస్తున్నాను స్వామీ" అన్నాడు. చిత్తశుద్ధి మానవునికి అత్యవసరమైన మూలిక. ఈ చిత్తశుద్ధిలేకుండా ఇందులో దుర్గుణములకు అవకాశ మిచ్చినప్పుడు తన సాధన కూడా వ్యర్థమైపోతుంది. రెండవది క్రోధము. సర్వ సామాన్యమైన మానవునియందు మాత్రమే కాక భగవంతునియందు క్రోధాన్ని అభివృద్ధి పరచుకుంటూ వచ్చాడు హిరణ్యకశిపుడు. మహాశక్తి సంపన్నుడు హిరణ్యకశిపుడు. పంచభూతములను హస్తగతము గావించుకొని వాటితో ఆడుకున్న వ్యక్తి హిరణ్యకశిపుడు. ఇంతటి శక్తి సామర్థ్యములు కల్గిన హిరణ్యకశిపుడు కూడను "క్రోధము" అనే దుర్గుణము తనలో ప్రవేశించటం చేత సర్వవిధముల నాశనమయ్యాడు. రాజాధిరాజు, గొప్ప బలవంతుడు, శూరుడు, పరాక్రమవంతుడు అయిన దుర్యోధనునికి ఎంత ఉండినా అతనిలో లోభము ప్రవేశించింది. ఈ "లోభము" ప్రవేశించటంచేత సర్వవిధములా నాశనమై పోయాడు. తన వంశమునే నాశనము గావించుకున్నాడు. ఇలాంటి కామ క్రోధ లోభములయొక్క మహాత్త్యములు ఈవిధముగా ప్రత్యక్షంగా గోచరమవు తున్నాయి. ఇక మోహము. కైక తన కుమారుడైన భరతుని కంటె అమితముగా పెంచి సాకినది రామచంద్రుని. అట్టి ప్రేమతో నుండిన కైక మనస్సును అనేకవిధములుగా చాడీలు చెప్పి మంథర కఠినముగా మార్చివేసింది. ఈ రామునిపైనున్న మోహము భరతునిపై మార్పించింది. ఈ మోహము చేత

sri sathyasaivachanamrutam

తన రాజ్యమునకు అపకీర్తి తెప్పించింది. అపకీర్తి తెచ్చుకున్న కైకపేరు ఏ స్త్రీ అయినా పెట్టుకుంటుందా? ఊహూ! అట్టి మోహముతో భగవంతుని దూరం గావించు కోవటంచేత తన పేరును ఎవరు పెట్టుకోటానికి యిష్టపడరు.

దుర్యోధనుడు లోభి కాబట్టి, భగవంతుని కూడా ద్వేషించినవాడు కనుక అతని కీర్తి ప్రతిష్ఠలు మట్టి పాలైపోయినవి. మగవారియందు దుర్యోధనుడు పేరు ఎవరైనా పెట్టుకుంటున్నారా? హిరణ్యకశిపుడు గొప్ప సైంటిస్టు కూడా. తన శీలమునంతా సైన్సునందే నిమగ్నము చేశాడు. ఎప్పుడు పరిశోధనలు గావించుకుంటూ వచ్చాడు. ఎన్ని పరిశోధనలు చేసినా, ఎన్ని పరిశీలనలు సల్పినా మానవతావిలువలు అతనియందే మాత్రము లేకపోవటంచేత అట్టి హిరణ్యకశిపుని పేరు ఏ మగవారు పెట్టుకోటం లేదు. ఇంక రావణుడు తపఃసంపన్నుడు. 64 విద్యలు నేర్చిన ఘనుడు. గొప్ప ఇంజనీరు. విమానము మొట్టమొదట కనిపెట్టినది రావణుడే. పక్షి భాష, మృగభాష నేర్చుకున్నవాడు రావణుడు. ఇంత శక్తి కల్గిన రావణుని పేరు ఎవరైనా పెట్టుకుంటున్నారా? శక్తిసామర్థ్యముల కన్నా హృదయ పవిత్రత ఎంతో ముఖ్యం. కనుక ఇంద్రియాలను ప్రతి వ్యక్తి అదుపులో పెట్టుకోవాలి.

**అభిమాన, మమకారములుండినంతవరకు మానవుడు ఏనాటికి అభివృద్ధి చెందడు**

ఇల్లు కాలుతుంటే బయటకు పరుగెత్తి రావచ్చును. యింద్రియాలే కాలుతుంటే ఎక్కడకు పరుగెత్తిపోతావు? కనుక, ఇంద్రియాలకు దుర్గుణములు, దురాలోచనలనే నిప్పు అంటుకోకూడదు. దుర్గుణములు, దురాలోచనలు మానవుని యందు చేరటంచేత మానవత్వమే నిర్మూలనమైపోతున్నాది. బుద్ధి నాలుగు రకములుగా ఉంటున్నది. ఒకటి స్వార్థము, రెండవది స్వార్థ పరార్థము, మూడవది పరార్థము, నాల్గవది నిస్వార్థము. ఈ స్వార్థబుద్ధి తన క్షేమము, తన ఆనందము, తన సౌఖ్యము, తన శాంతి తప్ప మరొకటి ఏమాత్రము గుర్తించుటకు ప్రయత్నించదు. స్వార్థ పరార్థ బుద్ధి తనకు ఏది కావాలని ఆశిస్తున్నాడో, అట్టిదే పరులకు కూడా అందించమని ప్రార్థిస్తాడు. తాను ఎట్టి శాంతిని కోరుతున్నాడో అట్టి శాంతి లోకానికి అందించమని కోరుతుంటాడు. ఇక్కడ స్వార్థము, పరార్థము రెండింటితో కూడిన బుద్ధి. ఇది మానవుని సహజతత్వంగా మారాలి. ఇంక

sri sathyasai vachanamrutam

పరార్థబుద్ధి అనగా తనకు ఏమాత్రము ఆశించడు. దైవనిమిత్తమై తాను అంకితమైపోయి దైవము యొక్క ప్రేమను మాత్రమే ఆశిస్తాడు. ఎవరి చెడ్డను ఏమాత్రము కోరడు. 'సర్వజీవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అనే బుద్ధి, "లోకాస్సమస్తాః సుఖినోభవంతు" అనే విశాలభావము. ఇది పరార్థ బుద్ధి. ఇంక నిస్వార్థబుద్ధి అనగా ఏమిటి? ఏదీ లేదు. తాను భగవంతునికి అర్పితమైపోయాడు. నాది అనేది ఎక్కడా లేదు. నేను, నాది అనేవి ఉండినప్పుడే ఈవిధమైన బాధలు సంభవిస్తాయి. నాది అనేది మమకారము, నేను అనేది అహంకారము. అభిమాన మమకారములుండినంత వరకు మానవుడు ఏనాటికి అభివృద్ధికి రాడు. చిత్తశుద్ధి నిమిత్తమై నాది, నావారు అనేభావము నిర్మూలము గావించుకొని నిరంతరము హృదయాన్ని పవిత్రము గావించుకోవాలి. హృదయ పవిత్రతే జీవితము యొక్క ఘనశీలత. ఈ ఘన శీలతను సాదించే నిమిత్తమై మానవుడై జన్మించినాడు. నరునకు, నారాయణునకు ఉండిన భేదమింతియే. నాదబిందు కళలతో కూడిన వాడు నరుడు. నాదబిందు కళలకు అతీతమైనవాడు నారాయణుడు. అనగా ఒకటి ప్రవృత్తి, మరొకటి నివృత్తి. ఈ ప్రవృత్తియందు ఏమాత్రము నిస్వార్థముండదు. పరార్థము అసలే కనిపించదు. కేవలము వాంఛలు మాత్రమే పెంచుకుంటూ పోతుంటాడు. నివృత్తియందు ఏ వాంఛలు ఉండవు. కానీ భగవంతుని యందు మాత్రమే సర్వము అర్పితము గావించుకొని ఉంటాడు. హృదయాన్ని కూడా అర్పితము గావిస్తాడు.

**ఏ హృదయంబు నొసంగితివో ఈశ నాకు**
**మరల దానినే అర్పింతు మహితమూర్తి**
**పరగ వీరేమి తెత్తు నీ పూజకొరకు**
**అజంలి ఘటింతు అందుకోవయ్య నీవు**

అన్నాడు. అతనే నిజమైన నిస్వార్థపరుడు. ఇట్టి నిస్వార్థపరులను గన్న తల్లులు ఎంతమందియో భారతదేశమందుంటున్నారు.

భారతదేశము, అన్ని దేశములకు ఉపాధ్యాయ స్థానము అలంకరించినది. ఇటువంటి పవిత్రమైన భారతదేశమందు పుట్టి భరతమాత బిడ్డలమని భావించి, సత్ ప్రవర్తనలో

srisathyasaivachanamrutam

అత్యంత దూరమైపోతున్నారు. నిరంతరము బాధలు బాధలు అనుకుంటారు. ఈ బాధలు ఎంతకాలము ఉండవచ్చు? జీవితమంతా బాధలు లేకుండా ఉండుటకు వీలు కాదే. 'న సుఖాత్ లభ్యతే సుఖం' సుఖమునుండి సుఖము లభించదు; కష్టములనుండియే సుఖము లభిస్తుంది. ఇలాంటి పవిత్ర భారతదేశమందు పుట్టి, భారతీయులమని పేరు పొంది, భారతమాత బిడ్డలుగా రూపొందింపచేసుకొని భారతీయ సంస్కృతికి అత్యంత దూరమై పోవడం ఎంతో శోచనీయం. భారతీయ సంస్కృతి పవిత్రమైనది. నిస్వార్థమైనది. నిర్మలమైనది. ఇలాంటి పవిత్రమైన భారతీయ సంస్కృతిని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. ఏనాడు భారతీయ సంస్కృతిని బాలురు, బాలికలు గుర్తిస్తారో ఆనాడే భారతదేశము సౌభాగ్యముతో వర్ధిల్లుతుంది. ఉత్తమ స్త్రీ పురుషులు లేని దేశము సౌభాగ్య దేశము కానేరదు. ఎప్పటికి సౌభాగ్య దేశము కానేరదు. కనుక ఉత్తమ స్త్రీ పురుషులు ఈ దేశములో ఉద్భవించాలి.

**లోకములో దుర్మార్గులైన కుమారులున్నారుగానీ, దుర్మార్గులైన తల్లులు లేరు**

ఈ విద్యాసంస్థలన్నీ ఈ ఉద్దేశ్యముతో స్థాపించినవే. ఉత్తమ స్త్రీ పురుషులుగా అభివృద్ధి కావాలనే నిమిత్తమై నేను ఈ సంకల్పాన్ని సంకల్పించు కున్నాను. కొంతకాలము లోపలనే ఈ పవిత్రమైన భాగ్యాన్ని అనుభవిస్తారు, ఆనందిస్తారు. అన్నింటికి కాలము చాలా ప్రధానము. కాలము నిమిత్తమై మీరు కాచుకొని ఉండండి. మీ కర్తవ్య కర్మలు మీరు ఆచరించండి. తల్లులను మీరు ఏమాత్రము మరువకూడదు. ఈనాడు లోకములో దుర్మార్గులైన కుమారుడైనా ఉన్నాడుగానీ దుర్మార్గురాలైన తల్లులు లేరు. అట్టి పవిత్రమైన తల్లులు మీకు ఎన్ని విధములైన శక్తినో అందిస్తూ వచ్చారు. నీ అన్నము, నీ తెలివితేటలు, నీ శక్తి, నీ సామర్థ్యములు అన్నీ తల్లి అందించినవే. దీనినే అప్పుడప్పుడు పిల్లలకు చెబుతుంటాను. మీ blood, మీ దుడ్డు, మీ food, మీ head అంతా తల్లియొక్క ప్రభావమే. ఇట్టి త్యాగము చేసినందుకు మీ తల్లులకు మీరు ఏమాత్రము కృతజ్ఞత చూపుకుంటున్నారు? ఎక్కడనుంచి వచ్చింది ఈ దేహము? ఎవరు పెంచి పెద్ద చేశారు. కృతజ్ఞతను ఈనాడు మర్చిపోతున్నారు. ప్రాణాన్ని కూడా త్యాగముచేసి అభివృద్ధి గావించింది తల్లియే. కాబట్టి తల్లి ప్రేమను మరువకూడదు. తల్లి ప్రేమను మరచిన వ్యక్తి వ్యక్తియే కాదు. కనుక,

sri sathyasaivachanamrutam

మొట్టమొదట తల్లిని ప్రేమించాలి. తరువాత తండ్రిని ప్రేమించాలి. తల్లి, తండ్రి, గురువు, దైవము. ఇదీ వరుసక్రమము. తల్లి, తండ్రిని చూపుతుంది. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవాన్ని చూపుతాడు. కనుక తల్లి దండ్రి గురువు స్థానములు అందరు ఉత్తమమైనవిగా భావించాలి.

ఈనాడు తల్లుల యొక్క దినముగా భావిస్తూ వచ్చారు. మహిళా డే (Ladiesday) స్త్రీల పవిత్రపర్వదినమని, అనాదికాలమునుండి భారతదేశమందు తల్లిని దైవస్వరూపంగా పూజిస్తూ వచ్చారు. దుర్గ, సరస్వతి, వీరందరు తల్లితో సమానమే. వారికి వేరు వేరు పేర్లు పెట్టుకొని తల్లి రూపాన్నే చింతించారు. అందువల్లనే సరస్వతి స్వరూపాన్ని మనం విశ్వసించి ఆనందించి అనుభవించాలి. ఇటీవల కొంతకాలము క్రిందట, కొంతమంది సరస్వతి పేరును కూడా చెప్పకూడదని చెప్పారు. చాలా అజ్ఞానము. చాలా అమాయకత్వము. ఇట్టి తల్లితో సమానమైన సరస్వతిని విస్మరించటము చాలా విరుద్ధమైన కార్యము. సరస్వతిని స్మరించకుండా ఏ అక్షరము మనం వల్లించలేము. ప్రాచీనకాలము నుండి ఋషులు

**"సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి**
**విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమేసదా**
**పద్మపత్ర విశాలక్షి పద్మకేసరి వర్ణని**
**నిత్యం పద్మాలయాం దేవి సామాంపాతు సరస్వతి"**

అని సరస్వతీ దేవిని స్తుతించారు. మన భారతదేశమునకు ఈ సరస్వతి పేరే పెట్టారు.

భారతదేశమునకు సరస్వతి పేరు ఎట్లా వచ్చింది. భారతదేశమునకు సరస్వతిని ఎట్లా పోల్చుకుంటున్నారని అనుకోవచ్చు. సరస్వతికి 5 ప్రధానమైన పేర్లు ఉంటున్నాయి. అందులో భారతి ఒకటి. భారతి పేరు సరస్వతిదే. సరస్వతి పేరే భారతదేశానికి పెట్టారు గానీ రాజుయొక్క పేరు కాదు. దుష్యంతుని కుమారుడైన భరతుని పేరు ఈ దేశానికి పెట్టారనుకుంటున్నారు. అయితే, అంతకు పూర్వం ఈ దేశమున కేమనిపేరు? ఇవన్నీ తీసుకుంటే దైవమునుండి వచ్చిన పేర్లే యివన్నీ. సరస్వతి పేరు ప్రపంచములో అన్నింటియందు లీనమై ఉంటున్నాది. బ్రహ్మ పత్ని అని ఒక పేరు. బ్రహ్మ సృష్టికర్త. సృష్టికర్త

srisathyasaivachanamrutam

విషయాన్ని మనం విశ్వసించాలి. సృష్టికర్త యొక్క దివ్యత్వాన్ని కొంతవరకు జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

**ఆధ్యాత్మికమార్గమందు కూడా తల్లులే నేడు మార్గము చూపుతున్నారు**

స్త్రీ సంబంధమైన భావములు ఈనాడు అలక్ష్యం గావిస్తున్నారు. స్త్రీలంటే వంటయింట్లో పనిచేసే పనివారి మాదిరి విశ్వసిస్తున్నారు. కాదు కాదు. చదువకో వచ్చు, ఉద్యోగములు చేసుకోవచ్చు. మేధాశక్తిని పెంచుకోవచ్చును. కానీ గృహమును మర్చిపోకుండా చూచుకుంటు, చక్కదిద్దాలి తల్లి.

**ఉద్యోగములు చేయ నువిద లందరు పోవ**
**ఇంటిలో నుండెడి ఇంతు లెవరు**
**ఆలుమగ లిరువురు ఆఫీసులకు పోవ**
**గృహము దిద్దెడి గృహిణి ఎవరు**
**పర బాలురకు నేర్వ పాఠశాలకు పోవ**
**తమ బాలురకు చెప్పు తరుణులెవరు**
**పుస్తకాల్ చేపట్టి పురుషుల వలే పోవ**
**వంటింటిలో చేయు వనిత ఎవరు**

**డబ్బులేనట్టి యిబ్బంది తీరిన**
**ఇంటిలోన కొరత ఎట్లు తీరు**
**సుఖము చూడబోవ శూన్యమే యగు కదా!**
**పదవి యందున్న పడతి కెపుడు.**

మొట్టమొదట తన బిడ్డలకు విద్యను నేర్పుకొని తరువాతనే యితరులకు నేర్పటానికి ప్రయత్నించాలి. తల్లులు ప్రతిదానికి ముందంజ వేస్తున్నారు. ఆధ్యాత్మిక మార్గము నందు కూడా తల్లులే మార్గము చూపుతున్నారు. ప్రతి పవిత్రమైన కార్యములకు తల్లులే కారణము. ఇట్టి తల్లులను ఏనాటికి మరువకూడదు. ఈవిధమైన ఆధ్యాత్మిక మార్గము నిరూపించే నిమిత్తమై నేను ప్రతి పుట్టిన పండుగకు ఈ దేహము యొక్క తల్లిదండ్రుల సమాధికి పోయి

srisathyasaivachanamrutam

వచ్చేవాడిని. సాయిబాబాయే యింత గౌరవము చూపుతున్నాడు కాబట్టి మనము కూడా ఆచరించాలి అనే సద్భావము కలిగే నిమిత్తమై ఈ విధమైన సన్మార్గములో ప్రవేశిస్తూ వచ్చాను. మనం తల్లిని గౌరవించాలి, పూజించాలి. ఈనాడు ఈవిధమైన పవిత్రమైన భావములు ప్రతి హృదయమందు అభివృద్ధి గావించే నిమిత్తమై నేను ఈవిధముగా స్త్రీలకు మహిళా డే అని పెట్టాను. కేవలం నవంబరు 19th ఒక్క దినము కాదు. కొన్ని రాష్ట్రాలలో ప్రతినెల 19వ తేదీ యీ పండుగలు గావించుకుంటున్నారు. ఎలాంటి పవిత్ర సమయమందుగానీ లేక అపవిత్ర సమయమందు గానీ తల్లిని ఏమాత్రం విడువకూడదు.

కలి ప్రభావముచేత ఈ ఆధునికయుగములో తాను గొప్ప విద్యావంతుడై పోయి గొప్ప చదువరులైపోయి, గొప్ప బలమును సంపాయించు కొని, తల్లులంటే ఒక వంటమనిషి మాదిరి భావించుకుంటున్నారు ఈనాటి బిడ్డలు. వంటమనిషిగా భావించుకున్న ఫరవాలేదు. సర్వెంటుగా కూడా చూస్తున్నారు. ఇది వారి ఎన్ని జన్మల కర్మమో! బిచ్చగాడు యింటికి వచ్చి 'భవతి భిక్షాం దేహి' అంటాడు. అంటే, 'ఓ యజమానురాలా! యజమానుడా! నేను ఏ జన్మములోనో భిక్షగానికి అన్నం పెట్టలేదు. భిక్షగానిని పుత్రునివలె భావించలేదు. కనుక ఈనాడు నేను బిక్షగానిగా పుట్టాను. ఓ తల్లీ! తండ్రీ! మీరు తిరిగి వచ్చే జన్మలో బిక్షగాండ్లగా పుట్టకండి' అని హెచ్చరించే నిమిత్తమై భిక్షగాడు వస్తున్నాడన్నమాట. ఇంకా నేను మూడు జన్మముల యొక్క బిక్షగాడిని. పూర్వము నేను ఎవరికి భిక్షము పెట్టలేదు. అందువల్లనే నేను ఈ జన్మము ఎత్తాను. ఈ జన్మంలో నేను భిక్షం ఎత్తుతున్నాను గానీ భిక్షం తిరిగి పెట్టటం లేదు. తిరిగి వచ్చే జన్మము కూడా నేను భిక్షగాడినే అవుతాను. నేను భిక్షగాడ్ని భిక్షగాడ్నే. మీరుకాకండి" అని హెచ్చరించే కోసం వస్తున్నారు భిక్షగాళ్లు. ఎవరిని అడుగు తున్నారు? 'భవతి భిక్షాందేహి' అంటున్నారు. దేహి అనగా ఎవరు? దైవమే.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ ఆ**
**దేహియే దేవదేవుడు**

భిక్షగాడు ఓ దేహి అంటున్నాడు గానీ ఓ యజమాని! అనటం లేదు. గృహయజమాని పేరు



sri sathyasaivachanamrutam

కాదు దేహి. దేహి అనగా దైవము యొక్క పేరే. దైవాన్ని భిక్షమడుగు తున్నాడు. అందరు దైవాన్ని భిక్షమడగవలసిందే.

**త్యాగేనైకే అమృతత్వ మానసుః**

అన్ని రకముల భిక్షము యిచ్చేవాడు దైవము. ఏదీ భిక్షము? ధనము అంటే ఏమిటి? విద్య అంటే ఏమిటి? వివేకమంటే ఏమిటి? ఇవన్నీ దైవము నుండి పొందినటువంటివే. ఇవన్నీ దైవ ప్రసాదితములే. దైవము నుండి పొందిన వాటిని యింకొకరికి అందించాలి. నీవు పొందిన విద్యలు మరొకరికి కూడా బోధించాలి. నీవు సంపాయించిన ధనము మరొకరికి కూడా దానము చేయాలి. అప్పుడే నీ వద్ద ధనము శాశ్వతముగా నిలుస్తుంది. ప్రతిదానియందు త్యాగము కావాలి. **"త్యాగేనైకే అమృతత్వ మానసుః"** అన్నారు. అమృతత్వమునకు మూలకారణం త్యాగమే. ప్రతి మానవుడు త్యాగమునకు పూనుకోవాలి. ఒకతల్లి బిడ్డను ఎత్తుకొని వెడుతుంటాది. ఏదైనా క్రూరమృగము అడ్డము వచ్చిందంటే తనదేహాన్నైనా పులికి అందించటానికి సిద్ధమవుతుంది. బిడ్డను కాపాడుకోటానికి సర్వవిధముల ప్రయత్నం చేస్తుంది. అంత త్యాగశీలురైన వారు తల్లులు. అలాంటి పవిత్రమైన భావము కల్గినవారు తల్లులు. తమ ప్రాణములను పిల్లలపైన పెట్టుకొనిన వారు తల్లులు. కుమారుడు అభివృద్ధికి వస్తే ఎంతో ఆనందించేది తల్లి. ఇంకెవరికైనా కొంచెం అసూయ కలుగవచ్చు, ద్వేషము రావచ్చు. కానీ తల్లికి అది కాదు. కొడుకు ఎంత అభివృద్ధికి వస్తే అంత ఆనందము తల్లికి. అట్టి ఆనందపడే తల్లులున్న సమయంలో భారతదేశము నందు ఈ తల్లులను ఎందుకు కష్ట పెడుతున్నారు? mother land అని తల్లిపేరు ఈ దేశానికి ఉన్నాది.

**ఈనాడు రామనామమును స్మరిస్తున్నారు గాని, రాముని ఆదర్శములను విస్మరిస్తున్నారు**

తల్లిని ప్రేమించకుండా దేశాన్ని ప్రేమించినంత మాత్రమున గొప్ప వారౌతారా? కాదు కాదు, దేశాన్ని ప్రేమించినా ప్రేమించక పోయినా తల్లిని మాత్రం ప్రేమించాలి. తల్లిని, దేశాన్ని ప్రేమించటం అందరి కర్తవ్యం. దీనిని పురస్కరించుకొనియే రాముడు చెప్పాడు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని నేను పుట్టిన స్థానము, నాతల్లిని

srisathyasaivachanamrutam

స్వర్గలోకము కంటె గొప్పది అన్నాడు. తల్లిని మించిన స్వర్గం మరొకటి లేదన్నాడు. ఇలాంటి రామచంద్రుడే చూపిన ఆదర్శాన్ని విస్మరిస్తున్నారు. ఈనాడు 'రామరామ' అని స్మరిస్తున్నారు కాని ఆదర్శములను విస్మరిస్తున్నారు. రాముని పూజించుట కంటె రామాజ్ఞ ప్రకారం మీరు నడుచుకున్నప్పుడు గొప్ప భక్తులౌతారు. దేనినైనా మీరు మరచవచ్చు కానీ దైవాజ్ఞను అనుసరించండి. దైవము చూపించిన ఆదర్శమును మీరు విడువకూడదు. దైవ ఆదర్శమే నీజీవిత ఆదర్శము. తల్లి మనస్సు ఏమాత్రం కష్టపడకుండా చూచుకోవాలి. ఇలాంటి పవిత్రమైన బోధలు గావించే నిమిత్తమై ఈ పవిత్రమైన సుదినమందు, ఈ పవిత్రమైన కాలమందు 'తస్మాత్ జాగ్రత' అని జాగ్రత్తపరిచే నిమిత్తమై నేను నిర్ణయించుకున్నాను. ఒకానొక సమయములో శంకరాచార్య పీఠమునకు యిద్దరు ద్వారపాలకులుండేవారు. వారిద్దరు మానవుని యందు ఈ దుర్గుణములు ఎప్పుడు బయలు దేరుతుందో, దురాచారములు ఎప్పుడు వస్తాయో అని గుర్తించుకోటానికి నిముష నిముషానికి "జాగ్రత జాగ్రత" అని అటునుంచి యిటు, ఇటునుంచి అటు నడిచేవారు. ఒకనాడు శంకరాచార్యుల వారు మఠమునకు ఎంతో ఆస్తులంతా ఉన్నాయి. ఎంతో ధనం వస్తుంది, ఎంతైనా అభవృద్ధి గావించవచ్చును అని భౌతికమైన విషయములను చింతిస్తూ ద్వారం దగ్గరికి వచ్చాడు. ఆ సమయంలో అక్కడ కాపలా ఉన్న ద్వారపాలకులు "జాగ్రత జాగ్రత" అని పలకడం వినేటప్పటికి తన భావములు మార్చుకున్నాడు.

**"జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః**
**అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత"**

అని తనను తాను హెచ్చరించుకున్నాడు. వేదం "ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ని బోధిత" అని వేదం ప్రబోధిస్తూ వచ్చింది.

**నీ తల్లిని సంతోషపెట్టు, స్వామి సంతోషపడతాడు**

విద్యార్థులారా!

మీరందరు తల్లి ప్రేమను నిరంతరం స్మరిస్తూ ఉండాలి. తల్లిని కించిత్తైనా బాధపెట్టకుండా చూచుకోవాలి. స్వామి వేయి తల్లుల ప్రేమ అంటున్నారు మీరు. ఒక్క తల్లి

sri sathyasai vachanamrutam

ప్రేమనే మీరు అర్థం చేసుకోవడం లేదు, వేయి తల్లుల ప్రేమ మీకెట్లా అర్థం అవుతుంది? ఒక్క తల్లిని నీవు సంతోష పెట్టటానికి ప్రయత్నించటం లేదు. తల్లిని సంతోషపెట్టు స్వామి సంతోషపడతాడు. స్వామికి ఏమీ అక్కరలేదు. అనేకమంది అనేక విధములుగా వ్రాస్తూ వస్తుంటారు, హ్యాపీ బర్త్‌డే 'Happy birthday' అని. పిచ్చివారు మీరు. Happy లేని వారికి happy అని చెప్పవచ్చు. నేను ఎప్పుడూ happy గానే ఉంటున్నాను. Happy అని ఎందుకు చెప్పాలి? తల్లికి చెప్పండి, తండ్రికి చెప్పండి Happy birthday. ఎందుకంటే వారిని అనేక చిక్కుల్లో ఉండి, అనేక సమస్యలలో ఉంటుండి అశాంతిలో మునిగి ఉంటారు. పుత్ర వాత్సల్యం కనుక పుత్రుల అభివృద్ధి నిమిత్తమై బిడ్డల అభివృద్ధి నిమిత్తమై అనేక సమస్యలతో వారు మునిగి ఉంటారు. అలాంటి వారికి happy చెప్పండి. నీ మిత్రులకు happy చెప్పండి. నీ బంధువులకు happy చెప్పండి. భగవంతునికి happy చెప్పనక్కర లేదు. భగవంతుడు ఎప్పుడు ఆనంద స్వరూపుడే.

**నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణ రహితం**

అయిన భగవంతునికి ఎల్లప్పుడు ఆనందమే. తనయందే సర్వ ఆనందములు ఉన్నాయి. కనుక పిల్లలకు నేను అప్పుడప్పుడు చెబుతుంటాను, "ఎక్కడుంది happy? Happiness is union with God" అని. దైవముతోనే చేర్చండి. తల్లిదండ్రులను గౌరవించండి. అప్పుడే దైవానికి ఆనందము కల్గుతుంది. మీనుంచి ఏదీ నేను కోరను. కోరనక్కర లేదు. నాకేమీ అవసరం లేదు. మీరు ఆనందంగా ఉంటుండి మీ తల్లిదండ్రులను ఆనందపెట్టండి, అదే నాకు ఆనందము. మొట్టమొదట తల్లిని గౌరవించండి. తండ్రిని ప్రేమించండి. తండ్రిని గౌరవించండి. ఇరువురిని హృదయము నందుంచుకొని ఆరాధనతో సంతృప్తి పరచండి. తల్లితండ్రులు సంతృప్తి అయితే తప్పక మీరు జీవితమంతా సంతృప్తిగా ఉంటారు. అప్పుడు దైవమే మీ హస్తగతమై పోతాడు. దైవమును నీవు పిలవనక్కర లేదు. నీవు సత్ప్రవర్తనతో నడుచుకున్నప్పుడు దైవమే నీ దగ్గరకు పరుగెత్తి వస్తాడు.

sri sathyasai vachanamrutam

ప్రేమస్వరూపులారా! మీ ప్రేమతత్వాన్ని పెంచుకొని సమాజమును తల్చుకొని తల్లితండ్రులను ఆనందపెట్టండి. ఈవిధమైన ఆనందము మీరు కూడా అనుభవించండి. ఈనాడు నీవు పుత్రుడుగా ఉండవచ్చును. ఇంకా కొంత కాలమునకు నీవు తండ్రి కావచ్చు. ఈనాడు నీవు పుత్రికగా ఉండవచును. కొన్ని సంవత్సరములకు నీవు తల్లిగా మారవచ్చును. నీవు తల్లిగా ఉన్నప్పుడు నీ కుమారుడు నిన్ను ప్రేమించకపోతే ఎంత బాధపడతావు. కనుక మొట్టమొదట వర్తమానమును (present) ను నీవు దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే భవిష్యత్తు నీ హస్తగతం కాదు. అది రాబోయేది. ఇక గడచి పోయినది తిరిగి రాదు. గడచిపోయిన దానికోసం వగచకండి. రాబోయే దానికి మీరు ఎదురు చూడకండి. ఉన్న దానిని నీవు ఆనందంగా అనుభవించు. ఇది omni present. ఈనాడు present అనేది విత్తనంగా ఉంటున్నాది. Future లో యిదే విత్తనం చెట్టుగా మారుతుంది. Past లో నున్న చెట్టు ఈనాడు విత్తనమును ఇచ్చింది. కాబట్టి past, future అను రెండు present పైనే ఆధారపడి ఉన్నాయి. కనుక present ని భద్రంగా చూచుకొని, present లో ఎట్టి దోషములు రాకుండా ఎట్టి బాధలు యితరులకందించకుండా మీరు సుఖంగా ఉండాలి. తల్లితండ్రులను సుఖపెట్టండి. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు అన్నారు. ఎవ్వరిని ఏవిధంగా బాధించకూడదు.

**పరుల దోషములను నీవు ఒకటి వెతికితే, పరులు నీ దోషములను నూరు వెతుకుతారు**

**"పరులు పరులుకాదు, పరమాత్ములగునయా"** ఎవ్వరిని దూషించ కూడదు. పరులయందు ఏమాత్రము దోషము వెతకకూడదు. పరులదోషము నీవు ఒకటి వెతికితే పరులు నీ దోషాలను నూరు వెతుకుతారు. కనుక ఎవ్వరియందు దోషములు వెతకకూడదు. ఎవరిని దూషించకూడదు. అందరిని ప్రేమించు. అందరిని విశ్వసించు. తల్లితండ్రులను ప్రార్థించు, పూజించు, ప్రేమించు. అదియే నీ జీవితానికి సరైన సంపద. నీకు సంపద కావాలని బాధ పడవద్దు. తల్లితండ్రుల ఆశీర్వాదమే నీ సంపద. అదియే నీ health, ఆ health, wealth తల్లిదండ్రుల ఆశీర్వాదముచేత లభ్యము అవుతుంది. పుండరీకుడు పాండురంగని భక్తుడు. నిరంతరము తల్లిదండ్రుల సేవ చేసేవాడు. ఒకనాడు తల్లిదండ్రులకు ఆరోగ్యం సరిలేకపోవటం చేత ఇంటియందే ఉండి వారి సేవలు

చేస్తున్నాడు. ఆనాడు పుండరీకుడు పాండురంగని మందిరానికి పోలేదు. పాండురంగడే నడచుకొని అతని ఇంటికి వచ్చాడు. ఎందుకీనాడు పుండరీకుడు నా మందిరానికి రాలేదు అని వచ్చాడట. తల్లిదండ్రులకు పాదాలు వత్తుతున్నాడు. అప్పుడు పాండురంగడు 'పుండరీకా నేను వచ్చాను' అన్నాడు. కానీ పుండరీకుడు అటువైపు తల తిప్పలేదు. 'వచ్చారా స్వామీ! చాలా సంతోషం ఉండండి కొంచెం సేపు' అన్నాడు. నా తల్లితండ్రులు నిద్రించేంత వరకు వారి సేవ నేను మానను అన్నాడు. పాండురంగడు 'నేను ఉంటాను' అన్నాడు. ఆనాడు చైర్స్, సోఫాలు లేవు. తన ప్రక్కన ఒక brick ఉన్నాది. ఆ brick ను విసరినాడు వెనక్కు. 'స్వామీ! దానిపైన కూర్చోండి నేను వస్తాను' అన్నాడు. పుండరీకుడు చెప్పినట్టుగానే పాండురంగడు ఆ brick పైన నిల్చున్నాడు. తల్లిదండ్రులు నిద్రించిన తరువాత అప్పుడు వెనుకకు తిరిగి, 'వచ్చినావా స్వామీ!' అని నమస్కరించాడు. అప్పుడు పాండురంగడు చెప్పాడు. 'నాయనా! ఈ సేవకంటె గొప్పది మరొకటి లేదు. ప్రపంచములో పుట్టిన ప్రతివ్యక్తి తల్లిదండ్రులను ప్రేమించి, వారి సేవ చేసుకుంటే జగమంతా స్వర్గముగా తయారౌతుంది. ఈనాడు తల్లిదండ్రులను మరవటం చేత జగమంతా అల్లకల్లోలమై పోయి అశాంతితో మునిగిపోతున్నాది. కనుక పుండరీకా! నీవు చాలా గొప్పవాడవు. నీ ఆదర్శమును సర్వబాలురకు అందిస్తూ రా అని చెప్పాడు. 'తల్లిదండ్రుల సేవ నా సేవగా భావించమన్నాడు' భగవంతుడు. భగవంతుని దగ్గరకు మనం పోవటం కాదు. భగవంతుడినే మన దగ్గరకు తెప్పించుకోవాలి. ఆ విధమైన శక్తి సామర్థ్యములు మనం సంపాయించుకోవాలి. ఆశక్తిసామర్థ్యములకు తల్లిదండ్రుల ప్రేమయే ప్రధానమైనది. ఎవరినైనా వదలుగానీ తల్లిదండ్రులను వదలవద్దు. భార్యలను select చేసుకున్నవారు ఉన్నారు. కానీ తల్లిని, తండ్రిని select చేసుకున్న వాడు లోకములో లేడు. ఒక్క దైవము మాత్రమే select చేసుకుంటాడు. కానీ యింకోరు select చేసుకోటానికి వీలు కాదు. యిది selection కాదు. నీకంటె ముందు పుట్టిన వారే వారు. వారిని నీవు ఆశ్రయించవలసిందే. ఈవిధమైన ఆశీర్వాదములు అందుకొని మానవుడు అభివృద్ధియై జగత్తులో ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొందుతారని నేను ఆశిస్తున్నాను.

ఈ పవిత్రమైన ladies day లోపల ladies కు తగిన విలువ నందించాలి. ఎవ్వరూ

sri sathyasai vahini vachanamrutam

ladies ను గౌరవించే వారే కనిపించటం లేదు. వారిని అవసరాలు వచ్చినప్పుడు, ఆకలైనప్పుడు వీరిని ఆశ్రయిస్తారు. అవసరం తీరిన తరువాత పిచ్చి వారివలె చూస్తుంటారు. **'ఏరు దాటిన తరువాత తెప్ప తగులబెట్టిన విధముగా, ...... బూటకములు'** అన్నారు. ఏరు దాటేంత వరకు తెప్ప కావాలి మనకు. ఏరు దాటిన తరువాత తెప్ప నీటిలో వేస్తారు. ఆవిధంగా నీ కష్టములు తీరేంతవరకు తల్లిదండ్రులు కావాలి. విదేశములకు వెళ్లావా, గొప్ప ఉద్యోగము సంపాయించుకున్నారా, తల్లిదండ్రులే జ్ఞాపకము రారు. ఒక చిన్న ఉదాహరణ చెప్పి నేను ముగిస్తాను. మద్రాసులో మీకందరికి తెలిసే ఉంటుంది V. రామకృష్ణ అని ICS చదివాడు. అప్పుడు IAS లేదు, ICS అనేవారు. కుమారుని అమెరికాకు పంపించాడు చదువుకోటానికి. ఒక్క నెల కాలేదు. అక్కడకు పోతూనే తల్లి phone చేసింది. దుర్గమ్మ ఆమె పేరు. ఆమెకు ఇంగ్లీషు రాదు. "బాబు ఎట్లా ఉన్నావురా" బాగా చదువుతున్నావా? నీ ఆరోగ్యం బాగుందా? అని ప్రశ్నిస్తూ వచ్చింది. 'నేను తెలుగు మర్చిపోయాను' అన్నాడు. నేను యింగ్లీషులోనే మాట్లాడాలి. తెలుగు రావటం లేదు అన్నాడు. ఆతల్లి ఆనందంగా వచ్చి నాదగ్గర చెప్పింది. 'స్వామీ! మా అబ్బాయి ఒక నెల అయింది వెళ్లి అమెరికాకు. తెలుగే మర్చిపోయినాడు' అని. అప్పుడు నేను అమ్మా! చిన్నప్పటినుండి పెంచి నీ భాషలో నీవు ఆప్యాయంగా పిలుస్తూ ఆనందమును అనుభవించిన ఆ కుమారుడు భాషనే మర్చిపోయినప్పుడు నిన్ను మాత్రం మర్చకుండా ఉంటాడా? అని ఆమెను ప్రశ్నించాను. ఇలాంటి వారు చాలామంది ఉంటారు లోకములో. విదేశాలకు వెడుతూనే తల్లిదండ్రులు ఏమాత్రం జ్ఞాపకముండరు. ఒక ప్రాచీన పండితుడు ఉండేవాడు. తన కుమారుని విదేశాలకు పంపాలంటే ఆయనకు యిష్టముండేది కాదు. విదేశముల habits, behaviour వీడు నేర్చుకుంటాడేమోనని భయపడేవాడు. కుమారుని చేత నిరంతరము గాయత్రీ మంత్రాన్ని స్మరింప చేసేవాడు. పిల్లవానికి చెప్పాడు. 'నీవు అక్కడకి వెళ్లినా గాయత్రిని మూడు వేళలందు స్మరిస్తూ ఉండు' అన్నాడు. బలవంతము చేత కుమారుడు అభివృద్ధికి వస్తాడని విదేశములకు పంపాడు. కుమారుడు విదేశములకు వెళ్లే ముందు "నీవు గాయత్రిని మర్చిపోతే నేను ఏమాత్రం నిన్ను జ్ఞప్తియుంచుకోను" నాకు కుమారుడే పుట్టలేదనుకుంటాను. ఆవిధంగా ప్రమాణం చేయమన్నాడు. అక్కడికి వెళ్లాడు

sri sathyasai vachanamrutam

కుమారుడు. ఈ promise ఎక్కడకు పోయిందో ఏమిటో! అన్నీ మరచిపోయాడు. ఒక్క దినమైనా గాయత్రి మంత్రం జపించలేదు. విదేశముల యొక్క ఆటలు పాటలు వాని లోపల మునిగి పోయాడు. తల్లికి చాలా సీరియస్ గా ఉన్నదని టెలీగ్రాం యిచ్చాడు తండ్రి. దానికి కూడా వాడు రాలేదు. కడపటికి తల్లి మరణించిందని టెలిగ్రాం ఇచ్చాడు. అప్పుడు పరుగెత్తి వచ్చాడు. వచ్చేటప్పటికి తల్లి మరణించలేదు. పిల్లవానిని ఎట్లైనా తెప్పించుకోవాలని యీ విధమైన సాకు చెప్పాడు. అప్పుడు తండ్రి ఏరోడ్రాం కి వెళ్ళి "నాయనా! ఆదేవి అనుగ్రహము చేత నీ తల్లి తిరిగి బ్రతికింది బాగుంది" అన్నాడు. మొట్టమొదట దేవి మందిరానికి వెళ్ళి తరువాత యింటికి వెడదామని కారులో మందిరానికి తీసుకువెళ్లాడు. How do you do mother అన్నాడు ఆంగ్లంలో వీడు. ఎట్లా ఉన్నావు? అని, చూడండి. దేవి అనే పేరే పోయింది. Mother అన్నాడు. Mother అన్నా మంచిదే. పిల్లలు దగ్గర మాట్లాడుతుంటారు చూడండి, ఆవిధంగా చులకనగా సంభాషణ చేస్తూ వచ్చాడు. ఇంటికి వచ్చి Hellow mother good morning అన్నాడు. ఈ మాట వినేటప్పటికి తల్లికి కోపం వచ్చింది. నీ పిండాకూడు! ఏమిట్రా good morning అని చెప్పటం? ఇలాంటి భావము కల్గిన కుమారుడు పుట్టి ప్రయోజనం ఏమిటి? నీవు నా కుమారుడే కాదు get out" అన్నది. అప్పుడు వాని బుఱ్ఱ తిరిగింది. ఈవిధంగా అనేకమంది మాటలలో, ఆటలలో మార్పులు చేసుకుంటున్నారు.

**తల్లిదండ్రుల సేవయే దైవసేవ**

జయమ్మ అనంతపురం girls మాత్రమే గొప్పవారని చెబుతూ వచ్చింది. What about our Prasanthinilayam boys. ఈ పిల్లలు కూడా మంచివారే. ఎప్పుడు చూచినా స్వామి గురించి చెప్పమని, స్వామికి ఏది యిష్టమో చెప్పమని నిన్ను అడిగినట్లుగా చెబుతున్నావు. కానీ పిల్లలు యిక్కడ స్వామికి ఏది యిష్టము, ఏది అవసరం, ఏవిధంగా చేస్తే స్వామి యిష్టపడతారు అని రాత్రింబవలు మా పిల్లలు అంతకంటె ఎక్కువగా చేస్తున్నారు. ఎవ్వరు ఏమీ తక్కువ లేదు girls, boys యిద్దరు సమానంగా good పిల్లలే. సాయి సంస్థలలో పెరిగి, సాయి సంస్థలలో అభివృద్ధి అయినవారు అక్కడో యిక్కడో కొన్ని పొరపాట్లు చేయవచ్చుగానీ అందరు మంచి పిల్లలే. మంచి పిల్లలే. నేను చెప్పున్నది కాదిది. తల్లిదండ్రులే చెబుతారు. అబ్బా ప్రశాంతి నిలయం వచ్చిన తరువాత మా పిల్లవానిలో చాలా మార్పు



sri sathyasai vahini amrutam

వచ్చింది స్వామీ అని అనుకుంటూ ఉంటారు. తల్లిదండ్రులకు తృప్తి రావాలి అదే నాకు సంతోషం. అప్పుడే నేను తృప్తి పడతాను. ఆడపిల్లలు గానీ, మగపిల్లలు గానీ తల్లిదండ్రులను సంతోషపెట్టండి. స్వామికి ఏమి సంతోషమని మీరు ప్రశ్నవేయకండి. తల్లిదండ్రులను సంతోష పెట్టటమే నాకు సంతోషము. నాకు ఏదీ అక్కరలేదు. వారిని సంతోష పెడితే నేను సంతోషిస్తాను. ఈ విధమైన భావములు అభివృద్ధిపరచుకొని పవిత్రమైన ఆదర్శములు జగత్తుకు చాటాలని నేను ఆశిస్తున్నాను. ఈ విధమైన భావాలు దినదినాభివృద్ధి గావించుకొని స్వామి తృప్తి కోసం మీరు పోనక్కరలేదు. తల్లిదండ్రుల తృప్తి మీరు విశ్వసించండి. వారికి ఏమైనా యిష్టము లేకపోతే సరియైన రీతిలో ఒప్పింప చేయటానికి ప్రయత్నించండి. Explain చక్కగా చేయండి. Explain చేస్తే వారు కూడా ఆనందిస్తారు. అట్లా Explain చేయకుండా కఠినంగా మాట్లాడితే వారికి ఏమి అర్థమవుతుంది పాపం? శాంతమును సంపాయించుకోండి. ఓపికతో వారు చెప్పినవి వినండి. కట్టకడపటికి వారు అంగీకరించేటట్టు చేయండి. ఈవిధమైన పవిత్రమైన భావాలు మీరు పెంచుకున్నప్పుడే సాయి సంస్థలో చదువుకున్న ఆదర్శాలను జగత్తున కందించగలరు.

**(తేదీ 19-11-1998న కుల్వంత్ హాలులో మహిళా దినోత్సవము సందర్భముగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam